ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 38.0 । కనిష్ఠం : 24.0
ANDHRAJYOTHY
3

జోగులాంబ గద్వాల జిల్లా వార్తలు
మంగళవారం 5 మార్చి 2024

# లక్ష్యం చేరలే..

- ఆయిల్‌పామ్ సాగు రైతులకు ప్రోత్సాహం కరువు
- తగ్గిన వర్షాలు, భూగర్భ జలాలు
- సహకారం అందించని వ్యవసాయశాఖ
- ఇన్‌పుట్ సబ్సిడీ రూ.2.45 కోట్లు పెండింగ్


గద్వాల మండలం కొత్తపల్లిలో సాగైన ఆయిల్‌పాం తోటలు

గద్వాల, మార్చి 4: గత రాష్ట్ర ప్రభుత్వం వరి విస్తీర్ణాన్ని తగ్గించి.. రైతులను ఆయిల్‌పాం తోటల సాగువైపు మళ్లించాలని పెద్ద ఎత్తున ప్రచారం చేసింది. అందులో భాగంగా జోగుళాంబ గద్వాల జిల్లాకు ఇచ్చిన టార్గెట్‌లో 35 శాతం మాత్రమే పూర్తి చేశారు. 2020-21లో అన్ని జిల్లాల్లో కొంతమంది రైతులతో ప్రభుత్వం ఈ తోటలను పైలెట్ ప్రాజెక్టుగా సాగు చేయించింది. ఆ తర్వాత అన్ని జిల్లాల్లో పెద్ద ఎత్తున సాగును చేపట్టారు. కానీ నిర్వాహణ సరిగా లేకపోవడంతో లక్ష్యం చేరలేదు. సబ్సిడీపై మొక్కల పంపిణీతో పాటు నాలుగేళ్ల పాటు నిర్వాహణ కోసం ఇన్‌పుట్ సబ్సిడీని అందించాల్సి ఉండగా జోగుళాంబ గద్వాల జిల్లాలో సబ్సిడీ అందలేదు.

### అందని ఇన్‌పుట్ సబ్సిడీ

అయిల్‌పాం సాగుచేసే రైతులకు ప్రభుత్వం ఏటా ఎకరానికి రూ.4,200 ఇన్‌పుట్ సబ్సిడీ అందిస్తుంది. ఇందులో రూ2,100 ఆయిల్ పాం తోట నిర్వహణ కోసం కాగా, మిగిలిన రూ.2,100 అంతర్‌పంట సాగు నిర్వాహణ ఖర్చులకు ఇస్తోంది. ఇలా నాలుగేళ్లపాటు అందించాలి. కానీ 2020-21లో తోటలు పెట్టిన రైతులకు రెండేళ్లపాటు, 2021-22లో తోటలు సాగు చేసిన వారికి ఏడాది మాత్రమే సబ్సిడీ ఇచ్చింది. 2021-22లో 1,479 ఎకరాలకు గాను రెండవ ఏడాది సబ్సిడీ ఇవ్వలేదు. అలాగే 2022-23లో 2,862 ఎకరాలకు, ఈ ఏడాది సాగు చేసిన 1,508 ఎకరాలకు కూడా సబ్సిడీ అందలేదు. సబ్సిడీ కింద రైతులకు దాదాపు రూ.2.45 కోట్లు అందాల్సి ఉంది. ఇన్‌పుట్ సబ్సిడీ అన్ని జిల్లాల్లో అందినా.. ఈ జిల్లాలో మాత్రం అందలేదు. నిర్వాహణ డబ్బులు అందకపోవడంతో రైతులు తోటలను నిర్వహణ వదిలేశారు.

### వెనుకడుగు

జిల్లాలో ఆయిల్‌పాం సాగుకు ప్రభుత్వం టార్గెట్ విధించింది. 2020-21లో 68 మంది రైతులతో 250 ఎకరాల్లో పైలెట్ ప్రాజెక్టు కింద సాగు చేయించింది. ఆ తర్వాత 2021-22లో 3,000 ఎకరాల టార్గెట్‌కు గాను 1,479 ఎకరాల్లో, 2022-23లో 6,200 ఎకరాలకు గాను 2,862, 2023-24లో 5,600 ఎకరాల టార్గెట్‌కు గాను 1,508 ఎకరాల్లో తోటలు సాగు చేశారు. అంటే ఇచ్చిన టార్గెట్‌లో 35 శాతం మాత్రమే పూర్తి చేశారు. అప్పటి వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి జిల్లా ఆయిల్ పాంకు అనువైన జిల్లా అని కితాబు ఇవ్వడంతో పాటు ఇదే జిల్లాలో ఆయన 50 ఎకరాల్లో ఈ తోటను సాగు చేశారు. కానీ రైతులకు భరోసా, నమ్మకం కలిగించడంలో విఫలం అయ్యారు. సరైన వర్షాలు లేకపోవడం, భూగర్భ జలం తగ్గుతుండటం, వరి ధాన్యానికి మంచి ధర పెరగడంతో ఈ ఏడాది ఆయిల్ పామ్ సాగు మందగించింది.


మొదటిసారి వచ్చిన అయిల్ సీడ్ పంటను ఎలా కోయాలో చూపుతున్న ఉద్యానవన సిబ్బంది(ఫైల్)

### నర్సరీల్లో పెరిగిపోతున్న మొక్కలు

జిల్లాకు ఇచ్చిన టార్గెట్‌కు పూర్తి స్థాయిలో మొక్కలను అందించేందుకు తెలంగాణ ఆయిల్ ఫెడరేషన్ నర్సరీని పెంచుతోంది. ఇందుకోసం బీచుపల్లి ఆయిల్ మిల్లు ఆవరణలో నర్సరీని ఏర్పాటు చేసింది. ఈ ఏడాది జిల్లా టార్గెట్ 5,600 ఎకరాల్లో తోటలు పెంచాల్సి ఉండగా.. 2.80 లోల మొక్కలను పెంచింది. ఇప్పటి వరకు జిల్లాలో 1,508 ఎకరాల్లో సాగు చేపట్టారు. ఎకరాకు 50 మొక్కల చొప్పున 75 వేల మొక్కలను మాత్రమే పంపిణీ చేశారు. ఇంకా దాదాపు 2.05 లక్షల మొక్కలు నర్సరీలో ఉన్నాయి. ఇప్పటికే ఏడాది దాటిపోయింది. అనుకున్న టార్గెట్ పూర్తికాకపోతే ఆ మొక్కలను ఎక్కడ నాటాలనే సమస్య ఉత్పన్నమవుతుంది. మరోవైపు మొక్కలు పెరుగుతుండటంతో నర్సరీ నిర్వహణ భారంగా మారింది. ఖర్చులు పెరిగిపోతున్నాయి. ఏం చేయాలో తోచని స్థితిలో నర్సరీ యాజమాన్యం ఉంది.

### సహకారం అందించని వ్యవసాయ శాఖ

వరిని తగ్గించి తక్కువ పెట్టుబడితో ఎక్కువకాలం ఆదాయం ఇచ్చే పంట అయిల్‌పాం సాగుపై జిల్లా వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పించడం లేదు. ఉద్యానవన శాఖలో సిబ్బంది తక్కువగా ఉండటంతో ఫీల్డ్ విజిట్ తగ్గింది. ఈ నేపథ్యంలో లక్ష్యం నెరవేరడం లేదు. ఒప్పంద కంపెనీ అయిన తెలంగాణ అయిల్ ఫెడరేషన్ సిబ్బంది సహకారం అందిస్తుండటంతో జిల్లాలో కొంత మేర ఆయిల్‌పాం సాగు నెట్టుకొచ్చింది. బదిలీ అయిన కలెక్టర్‌తో పాటు ప్రస్తుత కలెక్టర్ కూడా ఈ సాగుపై దృష్టి పెట్టకపోవడంతో టార్గెట్ పూర్తి కాలేదని తెలుస్తోంది.

### ప్రతిపాదించాం.. నిధులు రాలేదు

ఆయిల్‌పాం తోటల నిర్వాహణ కోసం రైతులకు ఇచ్చే ఇన్‌పుట్ సబ్సిడీ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదించాం. అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో నిధులు విడుదల కాలేదు. ఆ తర్వాత ప్రభుత్వం మారింది. మళ్లీ పంపించాం. వచ్చిన వెంటనే రైతుల ఖాతాలో జమ చేస్తాం. వర్షాభావ పరిస్థితులు, వరికి మంచి ధర రావడం, ఆయిల్‌సీడ్‌కు ధర తగ్గడం వంటి కారణాల వల్ల ఆయిల్ పాం తోటల టార్గెట్‌పై ప్రభావం పడింది. సాధ్యమైనంత వరకు పూర్తి చేస్తాం.

- అక్బర్ అలీ, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి, గద్వాల



ఆయిల్‌పాం సీడ్‌ను మార్కెట్‌కు తరలిస్తున్న రైతులు, టీఎస్ ఆయిల్ ఫెడ్ కంపెనీ వారు(ఫైల్)

# హామీలన్నీ నెరవేరుస్తాం

- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్ రెడ్డి


కోటకదిరలో నిర్వహించిన న్యాయ యాత్రలో పాల్గొన్న మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి చల్లా వంశీచంద్ రెడ్డి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబుబ్‌నగర్ రూరల్/హన్వాడ, మార్చి 4: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. ఆయన చేపట్టిన పాలమూరు న్యాయ యాత్ర సోమవారం మహబూబ్‌నగర్ రూరల్ మండలంలో కొనసాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, నాయకులతో కలిసి వంశీచంద్‌రెడ్డి మన్యంకొండ అలివేలుమంగ అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. తర్వాత కోటకదిర, పోతన్‌పల్లి, మాచన్‌పల్లి, రాంచంద్రపూర్, కోడూరు స్టేజీ, బొక్కలోనిపల్లి గ్రామాల్లో పాదయాత్ర చేపట్టారు. అదే విధంగా హన్వాడ మండలంలోని వేపూరు, పెద్దదర్పల్లి, మునిమోక్షం, మాదారం గ్రామల్లో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. బొక్కలోనిపల్లి చౌరస్తా వద్ద కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళా సంఘాలకు రుణాలు అమలు చేశామన్నారు. మార్చి 11న ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఈ పథకం కింద ఇళ్ల నిర్మాణానికి రూ.ఐదు లక్షలు ఇవ్వనున్నట్లు తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆదరించి, తనను మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థిగా దీవించాలని కోరారు. మాచన్‌పల్లి, కోటకదిర, ఓబులాయపల్లి గ్రామల్లో పలువురు బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు, బీఆర్‌ఎస్ మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్ రెడ్డి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, వంశీచంద్‌రెడ్డి, నాయకులు మారేపల్లి సురేందర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, పార్టీ రాష్ట్ర, జిల్ల మండల నాయకులు ఎన్‌పీ వెంకటేష్, ఆనంద్‌గౌడ్, మల్లు నర్సింహా రెడ్డి, ధర్మపూర్ నర్సింహారెడ్డి, చంద్రశేఖర్, గోవింద్ యాదవ్, మోహన్ రెడ్డి, అనిల్ రెడ్డి, గురువేందర్ రెడ్డి పాల్గొన్నారు.

# అమ్మపల్లిలో వ్యక్తి ఆత్మహత్య

తిమ్మాజిపేట, మార్చి 4 : నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలంలోని అమ్మపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్సై ఉమెన్స్‌ప్రిస్సిల్ల తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నడిమింటి బాలయ్య(45) కొన్నాళ్ల క్రితం అపెండెక్స్ ఆపరేషన్ చేయించుకున్నాడు. అయినా గత కొన్నాళ్లుగా కడుపునొప్పితో బాధపడుతున్న బాలయ్య ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమిసంహారక మందు తాగాడు. చుట్టుపక్కల వారు, కుటుంబ సభ్యులు గమనించి అతడిని జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు నవీన్‌కుమార్ సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు. బాలయ్యకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికపై కాంగ్రెస్ సన్నాహక సదస్సు

- హైదరాబాద్‌లో పాల్గొన్న మంత్రి జూపల్లి, ఎమ్మెల్యేలు


హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో మంత్రి జూపల్లి, ఎమ్మెల్యేలు

మహబూబ్‌నగర్, మార్చి 4: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై కాంగ్రెస్ నాయకులు సోమవారం రాత్రి హైదరాబాద్‌లో సన్నాహక సదస్సు నిర్వహించారు. ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు జి.మధుసూదన్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, పర్ణికారెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, ఈర్లపల్లి శంకర్, వంశీకృష్ణ, మేఘారెడ్డి, కూచకుళ్ల రాజేశ్ రెడ్డి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, మాజీ ఎంపీ మల్లురవి, నాయకులు సరిత, శివకుమార్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి, మన్నె జీవన్‌రెడ్డి, బాలాజిసింగ్ పాల్గొన్నారు. ఎమ్మెల్సీ నామినేషన్, నియోజకవర్గాల వారీగా ఓటర్ల మద్దతు కూడగట్టడం వంటి విషయాలపై చర్చించారు. సీఎం రేవంత్ రెడ్డి జిల్లా కావడంతో ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని నాయకులు నిర్ణయించారు.

# మహబూబ్‌నగర్ సీటు గెలుపు ప్రతిష్టాత్మకం

- బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ


సమావేశంలో మాట్లాడుతున్న డీకే అరుణ


మహబూబ్‌నగర్ (క్లాక్‌టవర్)/దేవరకద్ర, మార్చి 4: రాష్ట్రంలోనే మహబూబ్ నగర్ సీటు గెలుపు చాలా ప్రతిష్ఠాత్మకమైనదని బాజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. మహబూబ్‌నగర్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. అరుణ ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. తెలంగాణలో మహబూబ్‌నగర్ సీటు పక్కా గెలిచే సీటని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని కోరారు. విజయ సంకల్పయాత్ర మైలేజీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వచ్చే నెల రోజులు చాలా కీలకమని, ప్రతీ కార్యకర్త ఇంటింటికి వెళ్లి మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించాలన్నారు. ఈనెల ఏడున అసెంబ్లీ కోర్ కమిటీ భేటీ కానుందని, 10న శక్తి కేంద్రాల ఏర్పాటు, 12న బూత్ లెవల్ కమిటీల నియామకం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్ రెడ్డి, బుడ్డన్న, అసెంబ్లీ ఇన్‌చార్జి రాజేందర్ రెడ్డి, బీజేపీ కన్వీనర్ అంజయ్య రాష్ట్ర నాయకులు మిథున్ రెడ్డి, నాయకులు రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

కేంద్రంలో మళ్లీ బీజేపీదే విజయం

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ పార్టీ విజయం సాధిస్తుందని ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రుతి అన్నారు. సోమవారం దేవరకద్ర మండల కేంద్రంలోని పవన్‌కుమర్‌రెడ్డి నివాసంలో అసెంబ్లీ ప్రవాస్ యోజన నియోజకవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తొమ్మిదేళ్లుగా అందిస్తున్న పథకాలు ప్రజల గుండెల్లో నిలిచిపోయాయన్నారు. అభ్యర్థి ఎవరైనా గెలిపించుకోవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి కొండ ప్రశాంత్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనువాసులు, మండల నాయకులు పాల్గొన్నారు.

# కేఎల్ఐ డీ-82 కాల్వ.. పూర్తయ్యేనా?

- చెరుకూరు వద్ద నిలిచిన పనులు
- పరిహారం కోసం రైతుల నిరీక్షణ
- చివరి ఆయకట్టుకు 20 ఏళ్లుగా అందని నీరు


కల్వకుర్తి మండలం చెరుకూరు వద్ద నిలిచిన కేఎల్ఐ డీ-82 కాల్వ పనులు

కల్వకుర్తి, మార్చి 4: కేఎల్ఐ ప్రాజెక్టును 20 ఏళ్ల కిందట చేపట్టగా, చివరి ఆయకట్టుకు నేటికీ నీరందడం లేదు. చివరి ఆయకట్టుకు నీరందించేందుకు కల్వకుర్తి మండలం జంగారెడ్డి పల్లి నుంచి మాడ్గుల మండలం నాగిళ్ల వరకు 59 కిలో మీటర్ల మేర డీ 82 కాల్వ నిర్మించాల్సి ఉంది. అందుకోసం గత ప్రభుత్వం రూ.187 కోట్లు మంజూరు చేసింది. కాల్వ పనులు 90 శాతం పూర్తయ్యాయి. వెల్దండ మండలం చెరుకూరు సమీపంలో ఓ రైతు వ్యవసాయ భూమిలో 250 మీటర్ల విస్తీర్ణంలో ఉన్న టేకు తోటకు రూ.ఐదు లక్షల 50 వేల నష్ట పరిహారం పెండింగ్‌లో ఉంది. దీంతో అక్కడ ప్రధాన కాల్వ పనులు నిలిచిపోయాయి. అయితే ప్రధాన కాల్వ నుంచి సబ్ కెనాల్స్ పూర్తి స్థాయిలో నిర్మాణాలు కాలేదు. కాల్వపై యూటీ(అండర్ టన్నెల్)లు, ఎస్ఎల్ఆర్‌బీలు(సింగిల్ లైన్ రోడ్డు బ్రిడ్జి), ఎస్‌పీ(సూపర్ ప్యాసేజ్)లు సైతం నిర్మించాల్సి ఉంది. ప్రస్తుతం వెంకటాపూర్ సమీపంలో యూటీల నిర్మాణం జరుగుతోంది. ఇంకా యూటీలు పది వరకు, ఎస్ఎల్ఆర్‌బీలు ఐదు వరకు, ఆరు వరకు ఎస్‌పీలు నిర్మించాల్సి ఉంది.

### పెండింగ్‌లో పరిహారం

కేఎల్ఐ కాల్వకు భూములిచ్చిన రైతులకు సంబంధించిన 1,400 ఎకరాల వరకు నష్ట పరిహారం రావాల్సి ఉంది. 450 ఎకరాలకు గాను రూ.40 కోట్ల వరకు టోకెన్ అయ్యి ఆన్‌లైన్‌లో పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. ఇంకా 1,000 ఎకరాలకు పైగా సుమారు రూ.80 కోట్ల వరకు పరిహారం రైతులకు అందాల్సి ఉంది.


నిర్మాణంలో ఉన్న ఎస్ఎల్ఆర్‌బీ

### సీఎం రేవంత్‌పైనే ఆశలు

కల్వకుర్తి ప్రాంత వాసి ఎనుముల రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడంతో ఈ ప్రాంత రైతుల్లో ఆశలు చిగురించాయి. పెండింగ్‌లో ఉన్న నష్ట పరిహారం రైతులకు ఇప్పించి, కాల్వ పనులు పూర్తి చేసేలా చూడాలని రైతులు కోరుతున్నారు. అందుకోసం నిధులు కేటాయించాలని అడుగుతున్నారు.

### ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

ప్రభుత్వం చొరవ తీసుకుని రైతులకు పెండింగ్‌లో ఉన్న నష్ట పరిహారాన్ని మంజూరు చేయాలి. పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి. జూన్ 31 వరకు పనులన్నీ పూర్తయితేనే వానాకాలం పంటలకు రైతులకు నీరందుతుంది.

- గోవర్ధన్‌రెడ్డి, రైతు సేవా సంఘం అధ్యక్షుడు

### నిర్మాణ పనులు పూర్తి చేయాలి

ప్రధాన కాల్వపై నిర్మించాల్సిన యూటీలు, ఎస్ఎల్ ఆర్‌బీలు, ఎస్‌పీలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి. కాల్వ పనులు సకాలంలో పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

- బండెల రామచంద్రారెడ్డి, రైతు


# గంట్రావుపల్లిలో విద్యుదాఘాతం

- ఇళ్లలో కాలిపోయిన ఫ్యాన్‌లు, టీవీలు, ఫ్రిజ్‌లు
- వేల రూపాయల ఆస్తి నష్టం
- భయభ్రాంతులకు గురై బయటకు పరుగులు పెట్టిన స్థానికులు


షార్ట్‌సర్క్యూట్‌తో కాలిపోయిన ఫ్యాను


కాలిపోయిన స్విచ్ బోర్డు

పెద్దకొత్తపల్లి, మార్చి 4 : నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం గంట్రావుపల్లి గ్రామంలోని ఇందిరమ్మ కాలనీలో షార్ట్‌సర్క్యూట్ జరిగింది. కాలనీవాసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం గ్రామంలోని 11కేవీ విద్యుత్‌వైర్లు తెగిపోయి డొమెస్టిక్ వైర్లపై పడ్డాయి. దీంతో అధిక విద్యుత్ సరఫరా జరిగి ఇళ్లల్లో ఉన్న ఎలక్ట్రిక్ స్విచ్‌బోర్డులు, బల్బులు, ఫ్యాన్లు, టీవీలు, ఫ్రిజ్‌లు పెద్ద శబ్దంతో ఒక్కసారిగా పేలిపోయాయి. భయభ్రాంతులకు గురైన స్థానికులు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. కాలనీలో దాదాపు 50 వరకు ఇళ్లు ఉండగా ప్రతీ ఇంట్లో ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోయాయి. కాలనీ మొత్తం మంటలు చెలరేగి దట్టమైన పొగతో కమ్ముకుపోయింది. పాఠశాలల్లో సైతం ఎలక్ట్రిక్ స్విచ్ బోర్డులు కాలిపోవడంతో పొగ కమ్ముకుంది. దీంతో విద్యార్థులను బయటకు తరలించడానికి గ్రామస్థులు చాలా ఇబ్బందులు పడ్డారు. షార్ట్ సర్క్యూట్‌తో పెద్ద ఎత్తున ఆస్తి నష్టం వాటిల్లింది.


షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయిన మంచం

# గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

దామరగిద్ద, మార్చి 4 : నారాయణపేట జిల్లా దామరగిద్ద మండల కేంద్రంలో చేపల వేటకు చెరువులోకి వెళ్లి గల్లంతైన నాగప్ప(49) శవం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దామరగిద్దకు చెందిన మద్దెల్‌బీడ్ నాగప్ప ఆదివారం సాయంత్రం మరో వ్యక్తితో కలిసి దామరగిద్దలోని కొత్త చెరువులో చేపట వేటకు వెళ్లారు. వెంట వెళ్లిన వ్యక్తి చెరువు గట్టుపై నిలిచి ఉండగా చేపల కోసం చెరువులోకి నాగప్ప వెళ్లాడు. లోపల వల తట్టుకోవడంతో అక్కడే మునిగిపోయారు. సోమవారం గజ ఈతగాళ్లను తీసుకొని వచ్చి వెతకడంతో నాగప్ప మృతదేహం లభ్యమైంది. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య నీలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## గురుకులాల్లో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, మార్చి 4 : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి మిగులు సీట్ల భర్తీ కోసం అర్హత గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని గురుకుల ప్రాంతీయ సమన్వయ అధికారి ఫ్లోరెన్స్‌రాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురుకులాల్లో 6, 7, 8, 9 తరగతులకు బ్యాక్‌లాగ్ (మిగులు) సీట్లకు ఆన్‌లైన్ ద్వారా ఈనెల 23వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మహబూబ్‌నగర్, నారాయణపేట, జోగుళాంబ గద్వాల జిల్లాలో ఉన్న గురుకులాల్లో ఖాళీగా ఉన్న సీట్లకు రాత పరీక్ష ద్వారా భర్తీ చేయనున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 21న రాత పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

## విద్యానిధి స్కీమ్‌కు...

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, మార్చి 4 : మహాత్మా జోతిబాఫూలే బీసీ ఓవర్సీస్ కోసం 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను విద్యార్థులు ఏప్రిల్ 5వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీబీసీడబ్ల్యువో ఆర్.ఇందిర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల ఐదు నుంచి ఏప్రిల్ ఐదవ తేదీ లోపు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు.

## గ్రూప్-1 ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి

బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష కోసం ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు మహబూబ్‌నగర్ డీబీసీడబ్ల్యువో ఆర్.ఇందిర, స్టడీ సర్కిల్ డైరెక్టర్ స్వప్న సోమవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నారాయణపేట జిల్లాలకు చెందిన అభ్యర్థులు ఈనెల ఏడవ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు స్టడీ సెంటర్ డైరెక్టర్‌ను సంప్రదించాలన్నారు.

## చెట్టుపై నుంచి కింద పడి వ్యక్తి మృతి

పెద్దకొత్తపల్లి, మార్చి 4 : చింతచెట్టుపై నుంచి ప్రమాదవశాత్తున కింద పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం నక్కల పల్లి గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ కుర్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చింతకుంట భాగ్యమ్మ, బాలస్వామి (50) భార్యాభర్తలిద్దరూ ఆదివారం చింతపండు కోసం గ్రామ శివారులోని చింతచెట్టు వద్దకు వెళ్లారు. బాలస్వామి చెట్టుపైకి ఎక్కి చింతపండు రాలుస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన బాలస్వామిని చికిత్స నిమిత్తం నాగర్‌కర్నూల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. భాగ్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ వివరించారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

## అర్చక, ఉద్యోగులకు హెల్త్ ఇన్సూరెన్స్

**» అర్చక వెల్ఫేర్ బోర్డు తీర్మానం**

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అర్చక, ఉద్యోగులకు ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించేందుకు అర్చక వెల్ఫేర్ బోర్డు తీర్మానం చేసింది. బోర్డు చైర్మన్ నవీన్ మిట్టల్, దేవాదాయశాఖ కమిషనర్ అనిల్ కుమార్, విశ్రాంత హైకోర్టు జడ్జి వామన్‌రావు ఇతర అధికారులు సచివాలయంలో సోమవారం సమావేశమై పలు కీలక అంశాలపై చర్చించారు. అర్చక, ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలు ఈ సమావేశంలో కొలిక్కి వచ్చాయి. ప్రధానంగా, దేవాదాయశాఖ పరిధిలో విధులు నిర్వహిస్తూ గ్రాంట్ ఇన్ ఎయిడ్ పద్దులో వేతనాలు పొందుతున్న అర్చక, ఉద్యోగులకు హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించాలని తీర్మానం చేశారు. అయితే, ఒకేసారి అందరికి కాకుండా దశల వారిగా అమలు చేయాలనే నిర్ణయానికి వచ్చారు. మొదటి విడతలో రూ.50 వేలలోపు వేతనం ఉన్నవారికి, అనంతరం పలు దఫాల్లో మిగతా వారికి హెల్త్ ఇన్సురెన్స్ కల్పించనున్నారు. ఇందుకోసం అన్ని జిల్లాల నుంచి అర్చక, ఉద్యోగుల సమాచార సేకరణ ప్రక్రియ తక్షణం ప్రారంభించాలని దేవాదాయశాఖ అధికారుల్ని కోరారు.

## గతేడాది యాసంగి సీఎంఆర్ గడువు పెంపు

**» మే 15 తేదీ వరకు అవకాశం కల్పించిన కేంద్రం**

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గతేడాది(2022- 23) యాసంగి సీజన్‌కు సంబంధించిన కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) డెలివరీ గడువును రానున్న మే నెల 15 తేదీ వరకు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. సీఎంఆర్ గడువు పెంచాలని గత ఫిబ్రవరి నెల 23 తేదీన రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి రాసిన లేఖను పరిగణనలోకి తీసుకొని ఈ ఉత్తర్వులు ఇచ్చింది. బియ్యం రీసైక్లింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని, మిల్లుల వారీగా లిఖితపూర్వకంగా షెడ్యూలు తీసుకొని, ఎఫ్‌సీఐకి డెలివరీ చేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. ఎఫ్‌సీఐ క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని, డెలివరీ సమయంలో బియ్యాన్ని పరీక్షించి తీసుకోవాలని కూడా ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ ఉత్తర్వుల ఆధారంగా రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్.. వివిధ జిల్లాల మేనేజర్లు, డీఎస్‌వోలకు సోమవారం సర్క్యులర్ జారీచేశారు. యాసంగి సీజన్‌కు సంబంధించిన ధాన్యంలో ఇటీవల టెండర్లు పిలిచిన 35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మినహాయించి.. మిల్లింగ్ ప్రక్రియ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## అచ్చంపేటలో బీఆర్‌ఎస్‌కు ఎదురుదెబ్బ

లింగాల, మార్చి 4:నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీకి మరో ఎదురు దెబ్బ తగిలింది. లింగాల, బల్మూర్ జడ్పీటీసీ సభ్యులు నేజమ్మ, లక్ష్మమ్మ, బల్మూర్ ఎంపీపీ అరుణమ్మతో పాటు మరో 20 మంది బీఆర్‌ఎస్ కార్యకర్తలు హైదరాబాద్‌లో సోమవారం మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే వంశీకృష్ణ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి జూపల్లి కండువాలు కప్పి పార్టీలో ఆహ్వానించారు. బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు వ్యవహారం నచ్చక కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు వారు తెలిపారు.



## 5-6 నెలల తర్వాత..
# ఈ సర్కారుండదు

(మొదటి పేజీ తరువాయి)

నియోజకవర్గాలకు చెందిన బీఆర్‌ఎస్ ముఖ్య నేతలతో ఆయన సమావేశమయ్యారు. పార్టీ నేతలతో పలు అంశాలపై చర్చించారు. సిటింగ్ ఎంపీలు నామా నాగేశ్వరరావుకు ఖమ్మం, మహబూబాబాద్‌లో మాలోతు కవితకు మరోసారి పోటీకి అవకాశం ఇవ్వాలని ఈ భేటీలో ఏకగ్రీవంగా తీర్మానించారు. అదేవిధంగా ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల ఎన్నికల ఇన్‌చార్జులుగా పల్లా రాజేశ్వర్ రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారథిరెడ్డిని నిర్ణయించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. కొద్దిరోజుల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని, వారిపై ఉండే వ్యతిరేకతను బీఆర్‌ఎస్‌కు అనుకూలంగా మార్చుకుని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేద్దామని పార్టీ శ్రేణులతో అన్నారు. బీఆర్‌ఎస్‌ను వీడుతున్న వారివల్ల పార్టీకి ఎటువంటి నష్టం ఉండబోదని.. అలాంటి పరిణామాలను చూసి ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. 12న కరీంనగర్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించిన అనంతరం.. ఖమ్మంలోనూ బహిరంగ సభ చేపడతామని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పార్టీ ఓడిపోయినా.. అధైర్యపడాల్సిన పనిలేదని, నాయకులు ధైర్యంతో ముందడుగు వేయాలని సలహా ఇచ్చారు. పార్టీని పటిష్ఠం చేసుకోవడంలో భాగంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికీ ముగ్గురితో సమన్వయ కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. "బీఆర్‌ఎస్ పాలనలో సాగునీరు, తాగునీరు, విద్యుత్‌ను సమృద్ధిగా అందించడంతోపాటు సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలుతో ప్రజలకు చేయాల్సింది చేశాం. అయినప్పటికీ.. వారు మనకు ప్రతిపక్ష పాత్ర ఇచ్చారు. మన విలువ ప్రజలకు తొందరలోనే తెలుస్తుంది" అన్నారు. రాష్ట్రంలో రైతు బంధు, దళితబంధు వంటి పథకాలు ఎన్నికల కోసం తేలేదని, ఒక విజన్‌తో తెచ్చానని కేసీఆర్ చెప్పారు.



తెలంగాణ భవన్‌లో పార్టీ నేతలతో మాట్లాడుతున్న కేసీఆర్

### నలుగురు అభ్యర్థుల పేర్లు ఖరారు

రెండు రోజుల సమీక్షల అనంతరం కేసీఆర్ తమ పార్టీ తరఫున లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే నలుగురు అభ్యర్థుల పేర్లు ప్రకటించారు. కరీంనగర్ నుంచి బోయినపల్లి వినోద్‌కుమార్, పెద్దపల్లి నుంచి కొప్పుల ఈశ్వర్, ఖమ్మం నుంచి నామా నాగేశ్వరరావు, మహబూబాబాద్ నుంచి మాలోతు కవిత పోటీ చేస్తారని ఆయన వెల్లడించారు.

### ఎన్టీఆర్‌లాంటి నేతకే తప్పలేదు..

"రాజకీయాల్లో గెలుపోటములు సహజమే. ఎన్టీఆర్ లాంటి నేతకే ఒడుదొడుకులు తప్పలేదు.. ఆయన ముందు మనమెంత?" అని కేసీఆర్ ఈ భేటీలో వ్యాఖ్యానించినట్లు తెలిసింది. ఉమ్మడి రాష్ట్రంలో పాతాళానికి పడిపోయి కూడా మళ్లీ అధికారంలోకి వచ్చిన టీడీపీని చూసి నేర్చుకోవాల్సింది చాలా ఉందని పేర్కొన్నారు. "అప్పట్లో టీడీపీ మన పార్టీ కంటే దారుణంగా ఓటమి చవిచూసింది. అయినప్పటికీ.. తప్పులను సరిదిద్దుకొని తిరిగి చేజిక్కించుకుంది" అని పార్టీ శ్రేణులకు గుర్తుచేశారు. "అసెంబ్లీ ఎన్నికల్లో మనం ఓడిపోవడం కూడా మంచిదే.. గుర్రం ఏదో.. గాడిదేదో తెలుసుకునే అవకాశం రాష్ట్ర ప్రజలకు వచ్చింద"ని కేసీఆర్ వ్యాఖ్యానించారు. కాగా.. ఈ సమీక్షా సమావేశానికి భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు హాజరు కాలేదు. వెంకటరావు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడం లాంఛనమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### కాంగ్రెస్ మోసపూరిత వైఖరిని ప్రజలకు చెప్పండి: హరీశ్

అధికారంలోకి వచ్చి 3 నెలలు కావస్తున్నా ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ విఫలమైందని.. అసంపూర్తిగా అమలుచేసిన రెండు, మూడు హామీల చూపించి అన్నీ చేసినట్లు ప్రచారం చేసుకుంటోందని.. రాష్ట్రంలో ఆ పార్టీ అనుసరిస్తున్న మోసపూరిత వైఖరిని క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించి చెప్పాలని పార్టీ నేతలతో మాజీ మంత్రి టి.హరీశ్‌రావు పేర్కొన్నారు. ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల నేతలతో కేసీఆర్ సమీక్ష అనంతరం తెలంగాణ భవన్‌లో ఆ రెండు నియోజకవర్గాల అభ్యర్థులు, ముఖ్యనేతలతో హరీశ్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి అనుసరించాల్సిన కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ మోసాలపై ఎక్కడికక్కడ నిలదీయాలని, ప్రజల్లో చర్చ జరిగేలా చూడాలని సూచించారు. గల్లీలో కాంగ్రెస్ ఉన్నా, తెలంగాణ సమస్యలు ఢిల్లీ వేదికగా ప్రశ్నించేందుకు, పరిష్కరించేందుకు బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థులు గెలవాలన్నారు. కాగా.. ఖమ్మం లోక్‌సభ స్థానం నుంచి రాహుల్ గాంధీనే కాక ఎవరు పోటీ చేసినా ఎదుర్కొంటామని.. ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు స్పష్టం చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు బీఆర్‌ఎస్ వైపే ఉంటారన్నారు.



సిరిసిల్ల జిల్లా నారాయణపూర్‌లో జరిగే రేణుకామాత జమదగ్ని కల్యాణానికి రావాల్సిందిగా కేటీఆర్‌కు ఆహ్వాన పత్రిక అందిస్తున్న గౌడ సంఘం నేతలు

## ఎల్‌ఆర్‌ఎస్‌పై బీఆర్‌ఎస్ పోరుబాట

**» 6న నియోజకవర్గాల కేంద్రాల్లో ధర్నాలు**

**» 7న కలెక్టర్లు, ఆర్డీవోలకు వినతిపత్రాలు: కేటీఆర్**

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం)పై తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్‌ఎస్ పోరు బాటకు సిద్ధమవుతున్నట్లు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రులు సి.లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌లతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఎటువంటి ఫీజు వసూలు చేయకుండా ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ అనుమతులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందుకుగాను తమపార్టీ ఆధ్వర్యంలో ఈనెల 6న అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో, హైదరాబాద్‌లోని జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ కార్యాలయాలవద్ద ధర్నాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఎల్‌ఆర్‌ఎస్ బాధితులను కలుపుకొని ఈ ధర్నాలు విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. అదేవిధంగా 33 జిల్లాల పరిధిలో ఈనెల 7న జిల్లా కలెక్టర్లు, ఆర్డీవోలను కలిసి వినతిపత్రాలు సమర్పించాలని నిర్ణయించినట్లు కేటీఆర్ పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఎల్‌ఆర్‌ఎస్ ఫీజులు చెల్లించాలని చెబితే రక్తమాంసాలు పీలుస్తున్నామని నాడు విమర్శించారన్నారు. గతంలో తాము ఎల్‌ఆర్‌ఎస్ తెస్తే కోమటిరెడ్డి వెంకటరెడ్డి కోర్టుకు వెళ్లారని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎల్ఆర్‌ఎస్‌ను రద్దుచేస్తామని గతంలో భట్టివిక్రమార్క చెప్పారని, నో ఎల్‌ఆర్‌ఎస్.. నో టీఆర్‌ఎస్ అని వ్యాఖ్యానించారని గుర్తుచేశారు. అదేవిధంగా ఉచితంగా భూములను క్రమబద్ధీకరిస్తామని ఉత్తమ్ చెప్పారని, జనం సొమ్ము దోచుకోవడానికి ఎల్‌ఆర్‌ఎస్ తెచ్చారని సీతక్కకూడా అన్నారని పేర్కొన్నారు. ప్రజలపై ఆర్థికభారం మోపడానికి రంగం సిద్ధం చేశారని, రాష్ట్ర ప్రజల ద్వారా రూ.20వేల కోట్లు రాబట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తోందని కేటీఆర్ ఆరోపించారు.

### ఉమ్మడి పాలమూరు నేతలతో కేటీఆర్ భేటీ

త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక, లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి పార్టీ కార్యాచరణపై ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నేతలతో కేటీఆర్ సమావేశమయ్యారు. తెలంగాణ భవన్‌లో సోమవారం నిర్వహించిన ఈ సమావేశంలో మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నోటిఫికేషన్ విడుదల, నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పేరును ప్రస్తావించినట్లు తెలుస్తోంది. పార్టీ అధినేత దృష్టికి తీసుకువెళ్లి.. ఆయన పేరును ఖరారు చేయనున్నట్లు సమాచారం.

## బయట పడిన చీకటి ఒప్పందం

**» సభలో బీజేపీ, కాంగ్రెస్‌ల నైజం వెల్లడి**

**» చెవిలో పూలు పెట్టిన మోదీ, రేవంత్**

**» లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి కాంగ్రెస్ సాయం: ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి**

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్య ఉన్న చీకటి ఒప్పందం మరోసారి బయట పడిందని, ఆదిలాబాద్ సభలో ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం రేవంత్‌రెడ్డి అలై బలై తీసుకున్నారని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మోదీ వద్ద మోకరిల్లడాన్ని.. యావత్ తెలంగాణ చూసిందని, వారిద్దరి మధ్య ఉండే బడే భాయ్.. చోటే భాయ్ బంధం ప్రజల ముందే బహిర్గతమైందన్నారు. తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో సోమవారం మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల కోసం కాంగ్రెస్, బీజేపీల మధ్య అవగాహన కుదిరిందని, ఉత్తర తెలంగాణలో బీజేపీకి కాంగ్రెస్ సహాయం చేస్తుందని ఆయన జోస్యం చెప్పారు. తెలంగాణ ప్రజల చెవిలో రేవంత్‌రెడ్డి కాలీఫ్లవర్ పెడితే.. మోదీ కమలం పువ్వు పెట్టారని ఆయన ఎద్దేవా చేశారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితి దాటి రుణం అడిగితే.. కేంద్రం ఇబ్బంది పెట్టిందని.. అదే రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక తీసుకోవడానికి ఎలా అనుమతించారని ప్రశ్నించారు. ప్రధాని మోదీని సీఎం రేవంత్ ఒక్క మాట కూడా అనలేదని, మాజీ సీఎం కేసీఆర్‌పై మాత్రం ఒంటికాలితో లేస్తారని ధ్వజమెత్తారు. ప్రధాని మోదీ.. అదానీ బంధంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలు చేస్తుంటే.. రేవంత్ మాత్రం అదానీతో ఒప్పందం చేసుకుంటున్నారని, ఈ ఇద్దరు కాంగ్రెస్ నేతల్లో ఎవరిని నమ్మాలని పల్లా రాజేశ్వర్ రెడ్డి నిలదీశారు.

## ఓఆర్‌ఆర్ లీజు బేస్ ప్రైస్ రూ.7300 కోట్లు!

(మొదటి పేజీ తరువాయి)

అప్పగించడంపై నిరుడు ఏప్రిల్ 28న 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో.. 'రాసిచ్చేశారు' అనే శీర్షికతో ప్రచురించిన కథనం రాష్ట్ర రాజకీయాల్లో దుమారం సృష్టించింది. తాము అధికారంలోకి వచ్చాక దీనిపై విచారణ జరిపిస్తామని టీపీసీసీ చీఫ్‌గా రేవంత్ రెడ్డి అప్పట్లో ప్రకటించారు. సీఎం కాగానే దీనిపై హెచ్ఎండీఏ అధికారుల నుంచి పూర్తిస్థాయి నివేదిక కోరారు. టెండర్లు ఆహ్వానించినప్పుడు బేస్‌ప్రైస్‌ను ప్రభుత్వం ప్రకటించకపోయినప్పటికీ.. టెండర్ వేసిన నాలుగు సంస్థల్లో ఐఆర్‌బీ సంస్థ రూ.7272 కోట్లు, దినేష్‌చంద్ర ఆర్ అగర్వాల్ ఇన్‌ఫ్రా రూ.7007 కోట్లు, గవర్ కన్‌స్ట్రక్షన్ రూ.6767 కోట్లు, ప్రస్తుతం టోల్ వసూలు చేస్తున్న ఈగల్ ఇన్‌ఫ్రా రూ.5643 కోట్ల మేర బిడ్‌లను కోట్ చేశాయి. అత్యధికంగా కోట్ చేసిన ఐఆర్‌బీ సంస్థను.. 'మరింత అధికంగా చెల్లిస్తారా?' అని ప్రభుత్వ వర్గాలు కోరగా రూ.7380 కోట్లు చెల్లించేందుకు ఆ సంస్థ ముందుకొచ్చినట్లు అధికారులు ప్రకటించారు. ఓఆర్‌ఆర్‌పై ఏటా పెరిగే వాహనాలు, 3 నుంచి 4 శాతం మేర పెరిగే టోల్ చార్జీలతో ఏడాదికి కనీసం ఐదు శాతం ఆదాయం పెరిగినా సర్కారుకు భారీగా ఆదాయం పెరుగుతుంది. అయినా.. 30 ఏళ్ల లీజుకు బేస్‌ప్రైస్‌ను రూ.7300 కోట్లుగా నిర్ణయించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా.. ఓఆర్‌ఆర్ టీవోటీ ఫైనాన్షియల్ బిడ్‌ల ఇనిషియల్ ఎస్టిమేటెడ్ కన్సెషన్ వాల్యూను (ఐఈసీవీ) నిర్ధారించడానికి అప్పట్లో ఏర్పాటు చేసిన ఐఏఎస్ అధికారుల కమిటీయే రూ.7380 కోట్ల లీజు చెల్లించడానికి ఐఆర్‌బీ సంస్థను ఒప్పించినట్లు తెలిసింది. ఈ మేరకు.. గత ఏడాది ఆగస్టు 12 అర్ధరాత్రి నుంచి ఓఆర్‌ఆర్ ప్రైవేటు సంస్థ లీజులోకి వెళ్లగా, 11వ తేదీనే ప్రభుత్వానికి రూ.7380 కోట్ల చెక్కు అందింది. దాన్ని హెచ్ఎండీఏ ఖాతాలో 12న జమ చేయగా, మరుసటి రోజే రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆ సొమ్మును రాష్ట్ర ఖజానాకు మళ్లించారు. ఆ మొత్తాన్ని హైదరాబాద్ మహా నగర అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు వాడతామని.. అప్పటి సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ప్రకటించారు. కానీ, ఆ సొమ్మును రైతు రుణమాఫీకి వినియోగించినట్లు సమాచారం.

# రహదారులు రక్తసిక్తం!

**» రోడ్డు ప్రమాదాల్లో 11 మంది దుర్మరణం**

కొత్తకోట, సదాశివపేట, పటాన్ చెరు, బోయినపల్లి, మార్చి 4: రాష్ట్రంలో రహదారులు రక్తసిక్తమయ్యాయి! వేర్వేరు జిల్లాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 11 మంది దుర్మరణం చెందారు. నిశ్చితార్థానికి వెళ్తున్న కుటుంబసభ్యుల కారు అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో అందులోని వారిలో ఐదుగురు దుర్మరణం చెందారు. మరో ఐదుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ ఘటన సోమవారం వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలో చోటుచేసుకుంది. కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి పట్టణం బసవన్నకుంటకు చెందిన సలీమాబీ మనవడు అలీకి హైదరాబాద్‌లోని ఓ కుటుంబంతో పెళ్లి సంబంధం ఖాయమైంది. సోమవారం హైదరాబాద్‌లో నిశ్చితార్థం ఉన్నందున సలీమా బీ కుటుంబసభ్యులతో కలిసి ఆదివారం రాత్రి ఎర్టిగా కారులో బళ్లారి నుంచి బయలుదేరారు. అలీ డ్రైవింగ్ చేస్తున్నాడు. సోమవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో కొత్తకోట సమీపంలోని బైపాస్ రోడ్డులో వారి కారు జాతీయ రహదారి పక్కనున్న చెట్టును ఢీకొంది. కారు ముందుభాగం నుజ్జునుజ్జయింది. దీంతో ఘటనా స్థలంలోనే అబ్దుల్ రెహమాన్ (39), రుమానా (2), సలీమా బీ (95), రోషిణి (4), హనీఫా రిఫాత్ (7 నెలలు) మృతి చెందారు. అలీ, షఫీ, హసన్, ఖదీర్, అబీబ్‌లకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. తర్వాత షఫీ, హసన్, ఖదీర్, అబీబ్‌లను మెరుగైన వైద్యం కోసం కర్నూల్ అస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపారు. అతివేగం, నిద్రమత్తు ప్రమాదానికి కారణంగా తెలుస్తోందన్నారు. ఈ ప్రమాదంలో చిన్నదెబ్బ కూడా తగలకుండా సమీరా (8) బయటపడింది.

ఇదిలా ఉండగా.. బంధువు అంత్యక్రియలకు వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులిద్దరూ దుర్మరణంపాలైన ఘటన కామారెడ్డి జిల్లాలో సోమవారం చోటుచేసుకుంది. సదాశివనగర్‌కు చెందిన దంపతులు ఏనుగు జనార్దన్ రెడ్డి(49), ఏనుగు ప్రతిభ (42) మండలంలోని పద్మాజీవాడి గ్రామంలో తమ బంధువు మృతి చెందడంతో అంత్యక్రియలకు స్కూటీపై బయలుదేరారు. పద్మాజీవాడి వద్ద గుర్తుతెలియని వాహనం వెనుక నుంచి అతివేగంగా ఢీకొట్టడంతో స్కూటీపై నుంచి వారిద్దరూ కింద పడ్డారు. ప్రతిభపై నుంచి వాహనం వెళ్లడంతో ఆమె శరీరం నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతి చెందింది. జనార్దన్ కాలుపై నుంచి కూడా వాహనం వెళ్లడంతో కాలు తెగి రోడ్డుకే అతుక్కుపోయింది. అతన్ని వెంటనే హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించిన కొద్దిసేపటికే మృతి చెందాడు. కాగా సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఐనోల్ గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో బిహార్‌కు చెందిన సూరజ్(34), ఉత్తరప్రదేశ్‌కు చెందిన ధర్మేందర్(30) అనే భవన నిర్మాణ కార్మికులు మృతి చెందారు. ఆదివారం రాత్రి పల్సర్ బైక్‌పై పటాన్‌చెరు నుంచి ఐనోల్ మీదుగా కంజర్ల గ్రామం వైపు వెళ్తుండగా గుర్తు తెలియని కారు ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. ఇదిలా ఉండగా..రోడ్డు పక్కన పార్క్ చేసివున్న బొలేరో వాహనాన్ని షేక్ మహ్మద్ హుస్సేన్ (14) అనే విద్యార్థి నడుపుతున్న ద్విచక్రవాహనం ఢీకొట్టింది. శనివారం జరిగిన ఘటనలో అతను చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందగా వెనుక కూర్చున్న మరో విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సికింద్రాబాద్‌లోని బోయినపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.



వనపర్తి జిల్లా ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

### ఔటర్‌పై కారు ఢీకొని.. ఆర్మీ జవాన్ దుర్మరణం

నార్సింగ్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్ రోడ్డు దాటుతుండగా గచ్చిబౌలి నుంచి ఎయిర్ పోర్టు వైపు వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఆర్మీ జవాను మృతిచెందాడు. నార్సింగ్ వద్ద సోమవారం ఈ ఘటన జరిగింది. ప్రమాదం అనంతరం వాహనం ఆగకుండా వెళ్లిపోయింది. మృతుడు గోల్కొండ ఆర్టిలరీ సెంటర్‌లో ఆర్మీ జవాన్‌గా విధులు నిర్వహిస్తున్నారని, అయన పేరు కులాన్ అని నిర్ధారించారు. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. అయితే కులాన్‌ను ఓ రెడీ మిక్సర్ వాహనం ఢీకొట్టినట్లు సమాచారం. ఘటన తర్వాత కులాన్ మృతదేహం చాలా సేపటి దాకా అక్కడే ఉందని, వాహనదారుల్లో ఎవ్వరూ పట్టించుకోలేదని ఓ పోలీసు అధికారి వెల్లడించారు. మరి.. కులాన్ ఔటర్ రింగ్ రోడ్డువైపుకు ఎందుకు ఎక్కాడు? ఎక్కడికి వెళుతున్నాడు? అనే వివరాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. పాదచారులకు ఔటర్ రింగ్ రోడ్డుపైకి ప్రవేశం ఉండదు. కొంతమంది ఎయిర్ పోర్టుకు గానీ, గచ్చిబౌలికి గానీ వెళ్లాలన్నా ఔటర్ రింగ్‌రోడ్డుపైకి ఎక్కి షేరింగ్ ట్యాక్సీలను ఆపి ఎక్కడం లేదా లిఫ్ట్ అడిగి ఎక్కడం చేస్తుంటారు. ఆ రకంగా ఇతను ఎక్కడకైనా వెళ్లేందుకు వచ్చాడా? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# కాళేశ్వరం అక్రమాలపై న్యాయవిచారణ

**» కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ యాక్ట్ సెక్షన్3(1) ప్రకారం ఆదేశిస్తాం**

**» సుప్రీంకోర్టు లేదా హైకోర్టు మాజీ న్యాయమూర్తితో ఎంక్వైరీ**

**» మా విజ్ఞప్తి మేరకు ఆరుగురు సభ్యులతో ఎన్‌డీఎస్‌ఏ కమిటీ**

**» హైకోర్టుకు లిఖితపూర్వకంగా నివేదించిన రాష్ట్ర ప్రభుత్వం**

**» కాంగ్రెస్ నేత నిరంజన్ పిటిషన్ నాలుగు నెలలకు వాయిదా**

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అక్రమాలపై న్యాయవిచారణ జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు లిఖిత పూర్వకంగా తెలిపింది. కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ యాక్ట్-1952 సెక్షన్ 3 (1) అధికారాలను ఉపయోగించుకుని విచారణకు ఆదేశిస్తామని నివేదించింది. కాళేశ్వరం అక్రమాలపై సీబీఐ విచారణ చేపట్టాలని కోరుతూ కాంగ్రెస్ నేత జి.నిరంజన్ దాఖలు చేసిన పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ ధర్మాసనం సోమవారం మరోమారు విచారణ చేపట్టింది. దీనిపై ఏ నిర్ణయం తీసుకున్నారో తెలియజేయాలన్న హైకోర్టు గత ఆదేశాల మేరకు.. అడ్వొకేట్ జనరల్ ఏ.సుదర్శన్ రెడ్డి ప్రభుత్వ వాదనను ధర్మాసనానికి తెలియజేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి పలు అక్రమాలు జరిగినట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చిందని ఆయన తెలిపారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నిరుడు అక్టోబర్ 24, 25 తేదీల్లో ప్రాజెక్టును సందర్శించి.. ప్రాథమిక విచారణ చేపట్టిందని.. మేడిగడ్డ పిల్లర్ల కుంగుబాటుకు కారణాలు వివరిస్తూ గత నవంబర్ 1న ప్రభుత్వానికి లేఖ రాసిందని తెలిపారు. దీనిపై పూర్తిస్థాయి దర్యాప్తు అవసరమని అథారిటీ తన లేఖలో సూచించిందని ఏజీ పేర్కొన్నారు. "డ్యామ్ సేఫ్టీ అథారిటీ లేఖ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దర్యాప్తునకు ఆదేశించింది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ప్రాథమిక దర్యాప్తును పూర్తిచేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికను సమర్పించింది. సదరు ప్రాథమిక నివేదిక ఆధారంగా ప్రభుత్వం పలుచర్యలు తీసుకుంది. ఈఎన్సీ (ఐ) రామగుండం ఎస్.వెంకటేశ్వర్లు సర్వీసును టెర్మినేట్ చేశాం. దాంతోపాటు ఈఎన్సీ (జనరల్)ని రాజీనామా చేయాల్సిందిగా కోరాం. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తుది నివేదిక వచ్చిన తర్వాత బాధ్యులైన అధికారులపై పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటాం." అని వివరించారు. అలాగే.. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లను పూర్తిస్థాయిలో తనిఖీ చేయాలంటూ ఫిబ్రవరి 13న రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌డీఎస్‌ఏకి లేఖ రాసిందని.. ఈమేరకు ఆరుగురు సభ్యులతో ఎన్‌డీఎస్‌ఏ ఒక కమిటీని ఏర్పాటు చేస్తూ మార్చి 1న ఆదేశాలిచ్చిందని వెల్లడించారు. బరాజ్‌ల దుస్థితికి కారణాలు.. పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలను కమిటీ సిఫారసు చేయనుందని చెప్పారు. ప్రభుత్వ వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యల నేపథ్యంలో విచారణను నాలుగు నెలలకు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది.

## ప్రత్యేక ఉపన్యాసాలతో విస్తృత ప్రయోజనాలు

▸▸ ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాషా



అధ్యాపకురాలు స్రవంతికి జ్ఞాపికను అందిస్తున్న ప్రిన్సిపాల్

గద్వాల టౌన్, మార్చి 4 : పాఠ్యాంశాలతో పాటు ఇతర అంశాలకు సంబంధించి అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఇస్తున్న ప్రత్యేక ఉపన్యాసాలతో విస్తృత ప్రయోజనాలుంటాయని ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాషా అన్నారు. స్థానిక మహారాణి ఆదిలక్ష్మీ దేవమ్మ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో సోమవారం తెలుగు, ఆంగ్లం, జువాలజీ, గణితం, ఎకనామిక్స్ సబ్జెక్టులకు సంబంధించి ప్రత్యేక ఉపన్యాసాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల తెలుగు సహ ఆచార్యులు డాక్టర్ ఏ.వెంకటప్రసాద్ 'మన గ్రామ నామాలు' ఆంగ్ల అధ్యాపకురాలు ఏ.రాజేశ్వరి 'స్ట్రాటజీస్ ఫర్ ఎఫెక్టివ్ కమ్యూనికేషన్' అంశంపై ప్రసంగించారు. జువాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ జి.స్రవంతి 'శుక్రకణం ఉత్పత్తి మరియు పిండాభివృద్ధి' అంశంపై ఉపన్యసించారు. అర్థశాస్త్ర అధ్యాపకుడు సి.మన్యమన్న 'సస్టైనబుల్ డెవలప్‌మెంట్' అంశంపై ఉపన్యాసం ఇచ్చారు. గణితం అసిస్టెంట్ ప్రొఫెసర్ సత్యమ్మ 'మ్యాథమెటిక్స్ ఫర్ పీజీ ఎంట్రెన్స్' అంశంపై ఉపన్యసించారు. అనంతరం వారిని ప్రిన్సిపాల్, అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి. శ్రీపతినాయుడు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ లవీన మంజులత, అధ్యాపకులు కృష్ణమూర్తి, మేడిచర్ల హరినాగ భూషణం, సత్యన్న, వెంకటేశ్వరమ్మ, తిరుపతయ్య, శంకర్, మనోజ్‌కుమార్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ఇంటర్మీడియట్ పరీక్షలు

▸▸ ఐదవ రోజు పరీక్షకు 4,212 మంది హాజరు

గద్వాల టౌన్/మల్దకల్, మార్చి 4 : ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా ఐదవ రోజు సోమవారం ప్రథమ సంవత్సరం గణితం, బాటనీ, పొలిటికల్ సైన్స్, కమ్యూనిటీ హెల్త్ నర్సింగ్, బయో కెమిస్ట్రీ పరీక్షలు నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా ఉన్న 14 కేంద్రాల్లో 4212 (95శాతం) మంది హాజరయ్యారు. మొత్తం 4,436 మందికి 224 మంది గైర్హాజరయ్యారు. ధరూరు, మల్దకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని డీఈసీ కన్వీనరు, డీఐఈవో హృదయరాజు, పద్మావతి పరిశీలించారు. పరీక్షల ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు.

## పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలి

▸▸ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బల్గెర హుసేన్

రాజోలి, మార్చి 4 : పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బల్గెర హుసేన్ మాదిగ అన్నారు. మండల కేంద్రమైన రాజోలిలో సోమవారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డప్పు కళాకారులకు, చెప్పులు కుట్టుకుని జీవించే వారికి పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారి డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఏప్రిల్ 13న హైదరాబాద్‌లో బహిరంగ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం రాజోలి మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా బిజ బాస్కర్ మాదిగ, ఉపాధ్యక్షుడిగా అనిల్ మాదిగ, ప్రధాన కార్యదర్శులుగా బీసన్న, పురుషోత్తం, కార్యదర్శిగా హుసేన్ మాదిగతో పాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమదాసు మాదిగ, జిల్లా అధ్యక్షుడు మల్లెపోగు లక్ష్మణ్ మాదిగ, ప్రధాన కార్యదర్శి నరేష్, కోఆప్షన్ సభ్యుడు నిషాక్ పాల్గొన్నారు.

## క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

రాజోలి, మార్చి 4 : మండల కేంద్రంలో కొనసాగుతున్న భ్రమరాంబికా ఆడివేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ముందుగా దాత సంధ్య శ్రీరామ్‌రెడ్డి టాస్ వేసి పోటీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడా పోటీల్లో ప్రతీ ఒక్కరూ సంతోషంగా పాల్గొనాలని కోరారు. అనంతరం బ్యాటింగ్ చేసి ఆట ప్రారంభించారు. టోర్నమెంట్‌లో ఏడు జట్లు పాల్గొన్నాయి. మాజీ సర్పంచు కీ.శే. శ్రీరామ్‌రెడ్డి జ్ఞాపకార్థం వారి సతీమణి సంధ్య మొదటి బహుమతిగా రూ. 25,116, ఎంపీటీసీ సభ్యుడు షాషావలి రెండవ బహుమతిగా రూ.20,116, మాజీ సర్పంచు గంగిరెడ్డి మూడవ బహుమతిగా రూ. 10,116/- అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు గంగిరెడ్డి, గోపాల్ రెడ్డి, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

## రేణుకా ఎల్లమ్మ జాతర ప్రారంభం

గట్టు, ఫిబ్రవరి 4 : మండలంలోని చాగదోణలో రేణుక ఎల్లమ్మ జాతర సోమవారం ప్రారంభమైంది. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం రథోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. రథాన్ని పూలతో అలంకరిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఈనెల ఆరవ తేదీన జిల్లా స్థాయి మూడు బళ్లు, గ్రామ స్థాయిలో ఒంటి బండి గిరిక పోటీలు, ఏడున సందెరాళ్లు ఎత్తే పోటీలు నిర్వహించనున్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి నగదు బహుమతులు ఇవ్వనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

## హక్కుల సాధనకు ఐక్యపోరాటం

▸▸ టీఎస్‌యుటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిప్పన్న

రాజోలి, మార్చి 4 : హక్కుల సాధనకు భవన నిర్మాణ కార్మికులు ఐక్య పోరాటానికి సిద్ధం కావాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిప్పన్న అన్నారు. మండల కేంద్రంలోని ఆర్‌డీటీ కాలనీలో నిర్వహించిన తెలంగాణ భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా రేపల్లె అడివన్న, గౌరవ అధ్యక్షుడిగా విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా పురుషోత్తం, కోశాధికారిగా దావీదు, ఉపాధ్యక్షుడిగా రాజు, సహాయ కార్యదర్శులుగా నర్సింహులు, దానమయ్యతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

## పురుగు మందు డబ్బాతో
# మహిళ ఆందోళన

▸▸ భూ సమస్యను పరిష్కరించాలని కలెక్టరేట్‌లో వినతి

▸▸ పరిష్కరిస్తామని అదనపు కలెక్టర్ హామీ



బాధిత మహిళ గోకారిబీ

గద్వాల న్యూటౌన్, మార్చి 4 : తన భూ సమస్యను పరిష్కరించాలని ఓ మహిళ పురుగుల మందు డబ్బాతో ఆందోళనకు దిగిన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం చోటుచేసుకున్నది. వడ్డేపల్లి మండలం రామాపురం గ్రామానికి చెందిన గోకారిబీకి సర్వే నెం. 416లో ఎకరా భూమి ఉన్నది. అయితే దాన్ని ప్రభుత్వ భూమిగా అధికారులు రికార్డులో నమోదు చేశారు. అది తన భూమి అని, అధికారులు తప్పుగా నమోదు చేశారని, తన పేర మర్చాలని పలు మార్లు జిల్లా అదనపు కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరగడంతో పాటు ఇటీవలే నూతనంగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ బీఎం. సంతోష్‌కు కూడా ప్రజావాణిలో ఫిర్యాదు చేసింది. కానీ, సమస్య పరిష్కారం కాలేదు. దీంతో ఇక అధికారులపై విసుగుచెందిన ఆమె కలెక్టర్ కార్యాలయ ఆవరణలో తన వెంట తెచ్చుకున్న పురుగుమందును తాగేందుకు ప్రయత్నించింది. దీంతో అక్కడే ఉన్న కొందరు వ్యక్తులు వెంటనే ఆమెను అడ్డుకొని డబ్బాను లాక్కొని జిల్లా ఎస్పీకి సమాచారం ఇచ్చారు. ఎస్పీ ఆదేశాల మేరకు పట్టణ మహిళా కానిస్టేబుల్ ఆమెను జిల్లా అదనపు కలెక్టర్ కార్యాలయానికి తీసుకెళ్లారు. సమస్యను పరిష్కరిస్తామని జిల్లా అదనపు కలెక్టర్ ముసిని వెంకటేశ్వర్లు హామీ ఇవ్వడంతో ఆ మహిళ ఆందోళనను విరమించింది.

# ఓం నమశ్శివాయ

▸▸ అలంపూర్ క్షేత్రంలో శివరాత్రి మహోత్సవాలు ప్రారంభం

▸▸ బాలబ్రహ్మేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు ▸▸ జోగుళాంబ ఆలయంలో కుంకుమార్చన



లక్ష గలార్చన చేసిన నందనను సత్కరిస్తున్న ఈవో పురందర్‌కుమార్



అలంపూర్‌లోని ఆలయంలో యాగశాలలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

అలంపూర్, మార్చి 4 : ఐదవ శక్తిపీఠం అలంపూర్‌లో శివరాత్రి మహోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, అధికారుల ఆధ్వర్యంలో అర్చకులు బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. జోగుళాంబ అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన నిర్వహించారు. ఉదయం ఎనిమిది గంటలకు మహాగణాధిపతి పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనము, నాంది దేవతా ఆహ్వానం, యాగశాల ప్రవేశం, హోమం, అంకురార్పణ, అగ్నిమథనము, అగ్ని ప్రతిష్ఠ తదితర విశేష పూజలు చేశారు.

- బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో అఖండ భజన సప్తాహం నిర్వహించిన భజన మండలి సభ్యులను ఆలయ చైర్మన్ చిన్న కృష్ణయ్యనాయుడు, ఈవో పురందర్ కుమార్, ప్రధాన అర్చకుడు ఆనంద్‌శర్మ ఘనంగా సన్మానించారు.

- జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి పేరిట లక్ష గలార్చన చేసిన హైదరాబాద్‌కు చెందిన నందనను ఈవో పురందర్ కుమార్, చైర్మన్ చిన్న కృష్ణయ్య ఘనంగా సత్కరించారు. జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందించి అభినందించారు.

- స్వామి అమ్మవార్లకు కర్నూలుకు చెందిన భక్తుడు, ఆర్డీవో సత్యనారాయణరెడ్డి నూతన రథాన్ని అందజేశారు. అంతకు ముందు అర్చకులతో కలిసి నూతన రథానికి పూజలు చేశారు.

- కర్నూలుకు చెందిన భక్తుడు, డెంటల్ డాక్టర్ ప్రవీణ్ కుమార్ ఆలయానికి రూ. 50 వేల విలువైన వెండిగిన్నెను వితరణ చేశారు. సోమవారం దానిని ఆలయ చైర్మన్ చిన్న కృష్ణయ్య నాయుడు, ఈఓ పురందర్‌కుమార్‌లకు అందించారు. క్షేత్రంలోని అన్నదాన సత్రానికి రూ.1116 విరాళం ఇచ్చారు.

# మహోత్సవాలను విజయవంతం చేయాలి

▸▸ కలెక్టర్ బీఎం సంతోష్ ▸▸ అలంపూర్‌లో శివరాత్రి ఉత్సవాలపై అధికారులతో సమీక్ష

▸▸ భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశం



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్, హాజరైన అధికారులు

గద్వాల న్యూటౌన్, మార్చి 4 : అధికారులందరూ సమన్వయంతో పనిచేసి అలంపూర్‌లో మహా శివరాత్రి, మహా కుంభాభిషేకం మహోత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. బ్రహ్మోత్సవాల నిర్వహణపై సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాలులో దేవాదాయ, మునిసిపల్, పోలీసు, విద్యుత్, వైద్య ఆరోగ్య శాఖ, రోడ్లు భవనాలు తదితర శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. మహా శివరాత్రి ఉత్సవాలను తిలకించేందుకు అలంపూర్ క్షేత్రానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తారని తెలిపారు. అందుకు అనుగుణంగా విస్తృత ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. 12 సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే మహాకుంభాషేకం ఉత్సవాలను సోమవారం నుంచి ఎనిమిదవ తేదీ వరకు కొనసాగుతాయని తెలిపారు. ఎనిమిదవ తేదీన మహా శివరాత్రి సందర్భంగా నిర్వహించే మహా కుంభాభిషేకాన్ని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు అవసరమైన క్యూలైన్లు ఏర్పాటు చేయాలన్నారు. తాగునీరు. పార్కింగ్, నిరంతర విద్యుత్, వైద్యసదుపాయాలన కల్పనకు చర్యలు తీసుకోవాలని సూచించారు. తుంగభద్ర పుష్కరఘాట్ వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఏమైనా సమస్యలు తలెత్తితే వెంటనే అలంపూర్ ఎస్ఐ, సీఐలను సంప్రదించాలని, అత్యవసర సేవలందించేందుకు దేవాదాయ శాఖ ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్‌ను వినియోగించుకోవాలని సూచించారు. తుంగభద్ర పుష్కరఘాట్ వద్ద ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. 102, 108 వాహనాలను దేవాలయం వద్ద సిద్ధంగా ఉంచాలన్నారు. చౌరస్తా నుంచి అలంపూర్ వరకు మూడు బస్సులు, కర్నూల్ నుంచి అలంపూర్ వరకు ఏడు అదనపు బస్సులను నడిపించాలని డిపో మేనేజర్‌ను ఆదేశించారు. క్షేత్రంలో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. ఆలయ పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని మునిసిపల్ శాఖ అధికారులకు సూచించారు. సమావేశంలో ఈవో పురందర్, డీఎంహెచ్‌వో డాక్టర్ శశకళ పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శుల బదిలీలు

గద్వాల, మార్చి 4 : జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులను బదిలీ చేస్తూ సోమవారం రాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి. జిల్లాలో 255 పంచాయతీలు ఉండగా, 192 సీనియర్ పంచాయతీ కార్యదర్శులు, 32 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, 26 మంది అవుట్‌సోర్సింగ్ కార్యదర్శులు పని చేస్తున్నారు. వారందరినీ ఒకేసారి బదిలీ చేయడం జిల్లాలో ఇదే మొదటిసారి. గద్వాలలో పనిచేస్తున్న కొందరిని అలంపూర్ నియోజకవర్గానికి, అలంపూర్‌లో పనిచేస్తున్న కొందరిని గద్వాల నియోజకవర్గానికి బదిలీచేశారు. మరికొందరిని అదే నియోజకవర్గంలో మండలాలు మార్చినట్లు సమాచారం. పదవీ విరమణకు దగ్గరగా ఉన్నవారు, మహిళల పట్ల కొంత కనికరం చూపినట్లు తెలుస్తోంది. అయితే బదిలీ అయినవారిలో చాలా మంది మూడేళ్లకు పైగా అదే గ్రామ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్నారు. వీరి వలన గత అసెంబ్లీ ఎన్నికలలో ఇబ్బందులు తలెత్తాయని భావించిన నాయకులు వీరి బదిలీలకు పట్టుబట్టినట్లు సమాచారం ఎన్నికల కోడ్ అమలులో ఉండగానే బదిలీలు జరగడం పట్ల పంచాయతీ కార్యదర్శులు ఒకింత ఆగ్రహంగా ఉన్నారు. అయితే ఎన్నికల సంఘం నుంచి అనుమతులు తీసుకొని బదిలీలు చేసినట్లు సమాచారం.

## గద్వాల ఆర్డీవోగా రాంచందర్

గద్వాల న్యూటౌన్, మార్చి 4 : జోగుళాంబ గద్వాల జిల్లా ఆర్డీవోగా రాంచందర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఉద్యోగుల బదిలీలు కొనసాగుతున్నాయి. అందులో భాగంగా గద్వాల ఆర్డీవోగా ఉన్న చంద్రకళ మంచిర్యాల జిల్లాకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో నారాయణపేట జిల్లాలో పనిచేస్తున్న రాంచందర్‌ను గద్వాల ఆర్డీవోగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గద్వాల అర్బన్, మార్చి 4 : జిల్లాలోని బిజ్వారం, మల్దకల్ 33 కేవీ ఫీడర్లలో మరమ్మతుల వల్ల ఈ నెల 5వ తేదీన విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ రమేష్‌బాబు, ఏఈ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మల్దకల్ మండల పరిధిలోని మల్దకల్, మల్లెందొడ్డి, బిజ్వారం, బూడిదపాడు, గద్వాల మండలంలోని కాకులారం, ఎర్రవల్లి మండలంలోని సాతర్ల గ్రామాలకు మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

## వైద్య సేవలెప్పుడు ప్రారంభిస్తారు

▸▸ సీపీఎం మండల కార్యదర్శి మద్దిలేటి

అలంపూర్ చౌరస్తా, మార్చి 4 : గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన వంద పడకల ఆసుపత్రిలో వైద్యసేవలు ఎప్పుడు ప్రారంభిస్తారని సీపీఎం మండల కార్యదర్శి సింగరాజు మద్దిలేటి ప్రశ్నించారు. అలంపూర్ చౌరస్తాలోని వంద పడకల ఆసుపత్రిని సోమవారం ఆయన పరిశీలించారు. కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ఆసుపత్రిని నిరుపయోగంగా ఉంచడం సమంజసం కాదన్నారు. పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి ఆసుపత్రిలో వైద్య సేవలను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట నాయకులు వెంకటేశ్వర్లు, ఈదన్న ఉన్నారు.

## వ్యక్తి అనుమానాస్పద మృతి

రాజోలి, మార్చి 4 : మండల పరిధిలోని బుడమర్సు శివారులో ఏర్పాటు చేసిన భారత్ మాల క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఎస్ఐ జగదీశ్వర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భారత్ మాల రహదారి నిర్మాణ పనులు చేసేందుకు కర్ణాటక నుంచి 10 మంది వచ్చారు. వారితో పాటు వంట పని చేసేందుకు దేవసూరు గ్రామానికి చెందిన బాబు (45) కూడా వచ్చాడు. ఆదివారం ఉదయం పడుకొని ఉన్న ఆయనను 9.45 గంటల సమయంలోతోటి పనివారు లేపేందుకు ప్రయత్నించినా స్పందన లేకపోయింది. దీంతో అతడిని వెంటనే కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే బాబు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు భారత్‌మాల కాంట్రాక్టర్ రామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతడి మృతికి కారణాలు తెలియాల్సి ఉందని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

# మల్లన్న దర్శనానికి తరలిన స్వాములు

▸▸ శ్రీశైలానికి రాజోలి, మల్దకల్, మానవపాడుల నుంచి శివస్వాముల పాదయాత్ర



రాజోలి నుంచి శ్రీశైలానికి పాదయాత్రగా బయలుదేరిన శివస్వాములు

రాజోలి/ మల్దకల్/ మానవపాడు/ ధరూరు/ ఉండవల్లి మార్చి 4 : మండల కేంద్రానికి చెందిన శివస్వాములు సోమవారం ఇరుముడి కట్టుకొని మల్లికార్జునుడి దర్శనం కోసం శ్రీశైల క్షేత్రానికి పాదయాత్రగతా తరలివెళ్లారు. అంతకుముందు భ్రమరాంబికా అడివేశ్వర స్వామి దేవాలయంలో శివస్వాములు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇరుముడి కట్టుకుని, ప్రధాన వీధుల గుండా పాదయాత్రగా శ్రీశైల మల్లికార్జున స్వామి దర్శనానికి బయలు దేరారు. మహా శివరాత్రి నాటికి వారు శ్రీశైలానికి చేరుకుంటారని అర్చకుడు అడివి స్వామి తెలిపారు.

మల్దకల్ మండల కేంద్రానికి చెందిన శివస్వాములు సోమవారం శ్రీశైలానికి పాదయాత్రగా బయలుదేరారు. అంతకుముందు స్వయంభువు భూలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఇరుముడి ధారణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పాదయాత్ర ప్రారంభించిన వారిని కుటుంబ సభ్యులు, స్నేహితులు ఊరి చివరి వరకు వచ్చి సాగనంపారు.

మానవపాడు మండలంలోని చెన్నిపాడు గ్రామంలో మాలధారణ చేసిన శివస్వాములు సోమవారం ఇరుముడులతో శ్రీశైలంకు బయలుదేరారు. ఈసందర్భంగా గ్రామంలోని ఆలయాల్లో ప్రత్యేకపూజలు ఏర్పాటు చేసి భజనలతో కాలినడకన వెళ్లారు.

### శివస్వాములకు అన్నదానం

ధరూరు మండలం పెద్దచింతరేవుల ఆంజనేయ స్వామి అన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం శ్రీశైలంలో శివస్వాములకు అన్నదానం చేశారు. ఆలయ అర్చకుడు ఆద్యాకేశవాచార్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ట్రస్ట్ ద్వారా 12 సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఉండవల్లి మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం శివస్వాములకు అన్నదానం చేశారు. కర్ణాటక, గద్వాల ప్రాంతాల నుంచి శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్తున్న శివస్వాములకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వారం రోజులుగా అన్నదానం చేస్తున్నారు. ఉదయం ఉమా మహేశ్వర ఆలయంలో అర్చకుడు ఆంజనేయ శర్మ ఆధ్వర్యంలో పంచామృతాభిశేకం, బిల్వార్చన చేశారు.

# ఉత్సాహంగా మల్లయుద్ధం

▸▸ పోటీల్లో పాల్గొన్న 30 మంది యోధులు

▸▸ విజేతలకు బహుమతులందించిన ఎస్ఐ, మునిసిపల్ చైర్మన్



బరిలో తలపడుతున్న పంజాబ్, హర్యానా మల్లయుద్ధ వీరులు

అయిజ, మార్చి 4 : జోగుళాంబ గద్వాల జిల్లా అయిజలో మల్ల యుద్ధం (కుస్తీ పోటీలు) ఉత్సాహంగా సాగాయి. తిక్కవీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని జాతీయ స్థాయిలో ఏర్పాటు చేసిన ఈ పోటీలలో పాల్గొనటానికి పంజాబ్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, మధ్యప్రదేశ్, ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక నుంచి 30 మంది మల్లయుద్ధ వీరులు తరలివచ్చారు. ఈ పోటీలను సోమవారం సింగిల్ విండో మాజీ చైర్మన్ సంకాపూర్ రాముడు ప్రారంభించారు. ఈ పోటీలలో 35 మంది మల్ల యుద్ధ యోధులు పాల్గొన్నారు. ఉదయం ప్రారంభమైన ఈ పోటీలు రాత్రి వరకు హోరాహోరీగా కొనసాగాయి. మొదటి స్థానాన్ని కర్ణాటక రాష్ట్రం బీజాపూర్ జిల్లా, చండ చందు గ్రామానికి చెందిన రామ్‌చందర్ దక్కించుకున్నారు. తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌కు చెందిన రుద్రేశ్‌యాదవ్ రెండవ స్థానాన్ని దక్కించుకున్నారు. మూడవ స్థానాన్ని హర్యానాకు చెందిన వికాస్ దక్కించుకున్నారు. నాలుగవ స్థానాన్ని సంగారెడ్డికి చెందిన చరణ్ దక్కించుకున్నారు. ఐదవ స్థానాన్ని మెదక్‌కు చెందిన రామ్ శెట్టి దక్కించుకున్నారు. విజేతలకు ఎస్ఐ విజయ్‌భాస్కర్, మునిసిపల్ చైర్మన్ దేవన్న, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పటేల్ విష్ణువర్ధన్‌రెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందచేశారు.

# వంద శాతం ఆస్తి పన్ను వసూలే లక్ష్యం

▸▸ ముమ్మర కసరత్తు ప్రారంభించిన అధికారులు ▸▸ రాయితీ ప్రకటనతో వసూలుపై ఆశలు

▸▸ రూ.6 కోట్లు దాటిన మొత్తం డిమాండ్ ▸▸ ఇప్పటివరకు 47 శాతం వసూలు




గద్వాల పట్టణంలోని మునిసిపల్ కార్యాలయం

గద్వాల టౌన్, మార్చి 4 : మునిసిపాలిటీకి ప్రధాన ఆదాయ వనరైన ఆస్తి పన్ను వంద శాతం వసూలు చేయడమే లక్ష్యంగా అధికారులు ముమ్మర కసరత్తు ప్రారంభించారు. పేరుకుపోయిన బకాయిల(ఎరియర్స్)పై విధించిన వడ్డీ మీద రాష్ట్ర ప్రభుత్వం 90 శాతం రాయితీని ప్రకటించిన నేపథ్యంలో ఎరియర్స్ కలిపి, వర్తమాన ఆర్థిక సంవత్సరం వసూలు డిమాండ్ రూ.6.38 కోట్ల వరకు ఉంది. పెనాల్టీపై ప్రకటించిన వడ్డీ రాయితీ రూ.1.68 కోట్ల వరకు ఉండటంతో, 2024-25 ఆర్థిక సంవత్సరంలో మునిసిపాలిటీకి నికరంగా వచ్చే ఆదాయం రూ.4.8 కోట్లు ఉండే అవకాశముంది. ఈ క్రమంలో ప్రభుత్వం ప్రకటించిన వడ్డీ రాయితీపై విస్తృత ప్రచారం కల్పించి, వందశాతం వసూలు చేసే దిశగా అధికారులు ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు.

### ఆస్తుల సంఖ్య 15,300

గద్వాల పట్టణ పరిధిలో ఆస్తి పన్ను వసూలు చేయాల్సిన మొత్తం ఆస్తుల సంఖ్య 15,300గా ఉంది. ఇందులో నివాస గృహాలు 13,437 కాగా, నివాసేతర గృహాల విభాగంలో 947, రెండూ కలిపి (రెసిడెన్స్-నాన్ రెసిడెన్స్) 916 ఆస్తులు ఉన్నాయి. వీటిలో నివాస గృహాలకు ప్రస్తుత సంవత్సరం బకాయిలు, జరిమానాతో కలిపి రూ.3.20 కోట్లు వసూలు కావలసి ఉన్నది. నివాసేతర గృహాల విభాగంలో మొత్తం రూ.2.04 కోట్లు, మిశ్రమ ఆస్తులకు సంబంధించి 1.13 కోట్లు వసూలు కావలసి ఉన్నది. ఇప్పటి వరకు నివాస గృహాలపై రూ.1.17 కోట్లు (36.53 శాతం), నివాసేతర ఆస్తులపై రూ.1.07 కోట్లు (52.35 శాతం), మిశ్రమ ఆస్తులపై రూ.72.49 లక్షలు (64.07 శాతం) వసూలయ్యింది. వీటితో పాటు మునిసిపాలిటీ పరిధిలో కేంద్ర ప్రభుత్వానికి చెందిన మూడు ఆస్తులపై రూ.23 వేలు ఆస్తిపన్ను రావాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన ఆస్తులు 161 ఉండగా, వాటి ద్వారా రూ.1.53 కోట్ల పన్ను వసూలు కావలసి ఉన్నది. దీంతో పట్టణంలో ఆస్తి పన్ను వసూలు చేయాల్సిన అసెస్‌మెంట్ల సంఖ్య 15,464 కాగా, ఎరియర్స్, పెనాల్టీలతో కలిసి ప్రస్తుత ఏడాది మొత్తం డిమాండ్ రూ.7.92 కోట్లుగా ఉంది.

### పన్నులు చెల్లించి సహకరించాలి



ఆస్తి పన్ను బకాయిలపై ప్రభుత్వం 90 శాతం వడ్డీ రాయితీ ప్రకటించినందున ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మొత్తం పన్ను చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలి. ప్రభుత్వం ప్రకటించిన వడ్డీ రాయితీపై త్వరలోనే పట్టణంలోని అన్ని ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తాం. పట్టణంలో ఆటోల ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తాం.

**- డి.శంకర్‌సింగ్, మునిసిపల్ కమిషనర్**

### రాయితీతో తగ్గిన భారం

రాష్ట్ర ప్రభుత్వం మునిసిపల్ పట్టణాల పరిధిలోని ఆస్తి పన్నుల బకాయిపై విధించిన వడ్డీపై 90 శాతం రాయితీతో పన్ను చెల్లింపుదారులపై భారం తగ్గినట్లయ్యింది. పట్టణంలోని 15,300 ఆస్తులకు సంబంధించి చెల్లింపుదారులు రూ.1.68 కోట్ల మేర లబ్ధిపొందే అవకాశం ఉన్నది. మొత్తం ఆస్తులకు సంబంధించి రూ.1.19 కోట్ల మేరకు బకాయిలు ఉండగా, వాటిపై నిబంధనల మేరకు రూ.1.21 కోట్ల పెనాల్టీ విధించారు.